సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



అనుబంధ సంఘాలది కీలకపాత్ర

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో అనుబంధ సంఘాలది కీలక పాత్ర అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. -8లో



నవంబర్ 10 నుంచి ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ

నవంబర్ 10వ తేదీ నుంచి అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్లు కలెక్టర్ శివశంకర్ తెలిపారు. -8లో

గరిష్టం/కనిష్టం
34.8/27.4

వాతావరణం

జిల్లాలో బుధవారం 27.4- 34.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.17 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

---

1 ప్రతి నిరుద్యోగికి రూ.3,000 నిరుద్యోగ భృతి



ఇరవై లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం.. అప్పటివరకు ప్రతి నిరుద్యోగికి ప్రతి నెలా రూ.3000 భృతి ఇస్తాం.
- ప్రొద్దుటూరులో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి

2 రైతుకు ఏటా రూ.20,000 సాయం

కూటమి ప్రభుత్వం వస్తే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేలు సాయం అందిస్తాం.



- ఊరూరా ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి

3 ప్రతి ఇంటికి ఏటా 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం

టీడీపీ అధికారంలోకి వస్తూనే ప్రతి ఇంటికి ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం.



- కడపలో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే మాధవిరెడ్డి

4 తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి రూ. 15,000

మా ప్రభుత్వం వస్తే తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి రూ. 15వేలు చొప్పున ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఇస్తాం.



- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే చైతన్య రెడ్డి

5 మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం



టీడీపీ అధికారంలోకి వస్తూనే మహిళలందరికీ ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం
- మైదుకూరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

6 ఆడబిడ్డ నిధి ద్వారా మహిళకు నెలకు రూ. 1,500

18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెల నెలా రూ. 1500 అకౌంట్లో జమ చేస్తాం.



- ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు



బాబు సూపర్ 6 ఫ్లాప్

చంద్రబాబు మాటలు నీటి మూటలేనని రుజువయ్యాయి. తల్లికి వందనంపై మాట మార్చారు. నిరుద్యోగ భృతి పథకాన్ని నిలువునా పాతిపెట్టారు. అన్నదాత సుఖీభవ పేరిట ఏటా 20 వేలు ఇస్తా.. వ్యవసాయానికి వెన్నుదన్నులా' అంటూ మాటిచ్చి రైతన్నకు వెన్నుపోటు పొడిచారు. పెట్టుబడి సాయం మాటే మర్చిపోయారు. ఇక పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద రూ.1500 ఇస్తామన్నారు.. ఇప్పుడా ఊసే లేకుండా చేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వలేమంటూ అసెంబ్లీ సాక్షిగా తేల్చి చెప్పారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంపై పూటకో మాట మాట్లాడుతున్నారు. మొత్తానికి 'బాబు ష్యూరిటీ... భవిష్యత్‌కు గ్యారెంటీ' అంటూ ఎన్నికల వేళ ఊదరగొట్టిన బాబు.. భవిష్యత్తు ఏమోగానీ ప్రస్తుతానికి 'మోసం గ్యారెంటీ' అని మరోసారి రుజువు చేశారు. కామధేనువులాంటి వైఎస్ జగన్ సర్కార్‌ను పోగొట్టుకున్నామని.. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు వేదన చెందుతున్నారు.

- ఆరింట్లో ఒక్క పథకమూ అమలు కాలేదు
- ఆరునూరైనా అమలు చేయాలంటున్న జనం

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

9లో

సాక్షి ప్రతినిధి, కడప: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు. ఊరూరా సభలు పెట్టి.. వేలాది మంది జనాల సాక్షిగా ఇచ్చిన హామీలను సమాధి చేశారు. తనకు వెన్నతో పెట్టిన వెన్నుపోటు విద్యను ప్రజలపైనా ప్రయోగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైనా ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయక పోవడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

కోటలు దాటేలా మాటలు..

'ప్రతిఇంటికి ఉద్యోగం లేదంటే, నిరుద్యోగ భృతి రూ.3వేలు తప్పకుండా ఇస్తాం' ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పిన మాటలివి. దారిద్ర్యరేఖకు దిగువనున్నవారు జిల్లా వ్యాప్తంగా 5,82,633 కుటుంబాలున్నాయి. ఈ కుటుంబాలకు చెందిన చదువుకున్న యువకులంతా నిరుద్యోగ భృతికి అర్హులే. సరాసరిగా 83 వేల బీపీఎల్ కుటుంబాలు ప్రతి నియోజకవర్గంలో ఉన్నాయి. ఏటా వైవీయూ పరిధిలో డిగ్రీ పట్టాలు తీసుకుంటున్న వారు దాదాపు 12వేల మందికి పైగా ఉన్నారు. ఇంజరింగ్ పట్టా పొందేవారు దాదాపు 6వేల మంది జిల్లాలో ఉన్నారు. డిప్లొమో పూర్తి చేసేవారు 5వేల మంది ఉన్నారు. సరాసరిగా 35వేల మందికి తక్కువ లేకుండా ఏటా యువత పట్టాలు పుచ్చుకొని ఉద్యోగాలు కోసం ఎదురుచూస్తోంది. వీరంతా నిరుద్యోగ భృతి అమలు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

శఠగోపమే....

'అమ్మ ఒడి పథకంలో మార్పులు తీసుకొస్తాం. ఇంట్లో ఎంతమంది విద్యార్థులంటే అందరికీ తల్లికి వందనం పథకం ద్వారా రూ.15 వేలు చొప్పున చెల్లిస్తాం' ఎన్నికలకు ముందు బాబు ప్రకటించారు. ఇటీవల తల్లికి రూ.15 వేలు మాత్రమే చెల్లించనున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఎప్పుడిస్తారో ఇప్పటి వరకు స్పష్టం చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని పక్కాగా అమలు చేసి బడులు ప్రారంభమైన పది రోజుల్లో బడికి పంపే ప్రతి తల్లి ఖాతాకు రూ.15 వేలు నగదు జమ చేసేది.

- జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3,32,224 మంది 1 నుంచి 10వ తరగతి వరకూ చదివే విద్యార్థులున్నారు. మరో 26,601 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులున్నారు. మేనిఫెస్టో ప్రకారం వీరందరికీ రూ.15 వేల చొప్పున చెల్లించాలి. అంటే రూ.538. 24 కోట్లు చెల్లించాలి. ఈఏడాది ఆ నిధులు విడుదల చేసే పరిస్థితి కన్పించడం లేదని అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు వెల్లడించారు.

అన్నదాతా సుఖీభవ ఏదీ...

పంటల సాగుకు 'అన్నదాత సుఖీభవ' ద్వారా రైతులకు రూ. 20 వేలు ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 2,10,481 మంది ఈ పథకానికి అర్హులు. దీని ద్వారా రూ.420.96కోట్లు అందించాల్సి ఉంది. పీఎం కిసాన్ సాయం ద్వారా రూ.2 వేలు రైతులకు లభించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 380 కోట్లు లభించాల్సి ఉంది. ఆ దిశగా బాబు అడుగులు వేయడం లేదని కర్షకులు మండిపడుతున్నారు.

ఆడబిడ్డ నిధి అంతే...

18 ఏళ్లు నిండిన యువతి నుంచి 59 ఏళ్ల వరకూ ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఆడబిడ్డ నిధి చెల్లిస్తామని చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఈ లెక్కన జిల్లావ్యాప్తంగా 7,06,974 మంది మహిళలు అర్హులు. అంటే ప్రతినెలా రూ.106.05 కోట్లు మహిళలకు చెల్లించాలి. పథకం అమలులో చంద్రబాబు చేతులెత్తేయడంతో మహిళా లోకం గుర్రుగా ఉంది.

ఉచిత బస్సు ఊసే ఎత్తని బాబు సర్కార్...

మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అంటూ హామీ ఇచ్చారు. జిల్లాలో 6 ఆర్టీసీ బస్సు డిపోల ద్వారా 590 బస్సులు ప్రజారవాణాలో ఉన్నాయి. సరాసరిగా ప్రతిరోజు 1.29 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. వారిలో 30 శాతం మహిళలు ప్రతిరోజు ప్రయాణిస్తున్నారని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే 38,700 మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. తక్కువలో తక్కువంటే సరాసరిగా రూ.100 చార్జీలు చెల్లిస్తున్నారనుకున్నా, ప్రతిరోజు రూ.38.7లక్షలు మహిళలు చార్జీల రూపేణా భరిస్తున్నారు. అదిగో.. ఇదిగో అంటున్నారే కానీ పథకాన్ని అమలు చేయడం లేదని మహిళాలోకం ఆవేదన వ్యక్తం చేస్తోంది.


ఉచిత సిలిండర్లకు మంగళం....

ప్రతి కుటుంబానికి ఏటా 3సిలిండర్లు ఉచితంగా అందిస్తామని కూటమి నేతలు చెప్పారు. జిల్లాలో 5,86, 352 బీపీఎల్ కుటుంబాలున్నాయి. వారంతా అర్హులే. ఏడాదికి 17,59,056 సిలిండర్లు అందించాల్సి ఉంది. తద్వారా రూ.151.28 కోట్లు సర్కార్ భరించాల్సి ఉంది. కానీ ఈ పథకానికి మంగళం పలుకుతూ అసెంబ్లీ వేదికగా తేల్చిచెప్పడం గమనార్హం.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాల లబ్ధి

8,358.58 రూ. కోట్లలో..
నేరుగా లబ్ధిదారులకు చేరిన మొత్తం

ప్రభుత్వ పథకం | లబ్ధిదారులు | లభించిన మొత్తం రూ. కోట్లలో






బంపర్ హిట్

వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం ప్రతి ఇంటితలుపు తట్టింది.
అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్ఆర్ చేయూత, వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన, వసతి దీవెన..
ఇలా ఒకటా రెండా ఇచ్చిన ప్రతి హామీ అమలైంది.
సంక్షేమ క్యాలెండర్ ఏర్పాటు చేసి మరీ హామీలు అమలు చేసిన ఘనత జననేతకే దక్కింది.
ఇంటింటా సంక్షేమం వెల్లివిరిసింది.

బాబూ.. ఏదీ జవాబు?

మహిళలకు ప్రతి నెలా రూ.1500




7,06,974 ఆడబిడ్డ నిధికి అర్హులైన మహిళలు
106.05 కోట్లు ప్రతి నెలా కేటాయించాల్సిన నిధులు

బాబు మోసం చేశారు



సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు మహిళలకు ప్రతినెలా రూ.1500లు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు. చెప్పిన ప్రకారం అమలుచేసి ఉంటే ఇప్పటికి రూ.4500 వచ్చి ఉండేవి. ఇప్పటికైనా ప్రభుత్వం పథకాన్ని అమలు చేయాలి.
- చరిష్మా, వేంపల్లె

స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు




3.58 లక్షలు తల్లికి వందనం అర్హులు
538.24 ఏడాదికి కేటాయించాల్సిన నిధులు

వందనమా.. మంగళమా!



ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15,000లు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామి ఇచ్చింది. దీంతో పిల్లలను బాగా చదివించుకోవచ్చు అనుకున్నాం. ఇంత వరకు తల్లికి వందనం ఊసేలేదు. ఇది చాలా దారుణం.
- చెన్నమ్మ, ఎంఆర్‌పీఎస్ నాయకురాలు, ప్రొద్దుటూరు

ప్రతి ఇంటికి ఏటా మూడు సిలిండర్లు ఉచితం



3 ఉచిత సిలిండర్లు
5,86,352 అర్హులైన కుటుంబాలు
151.28 ఏడాదికి కేటాయించాల్సిన నిధులు


ఉచిత సిలిండర్లు ఎప్పుడిస్తారో?



కూటమి నేతలు ఏటా ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తామన్నారు. ఊరూరా తిరిగి ప్రచారం చేశారు. ఇంత వరకు ఆ ఊసే లేదు. హామీని త్వరగా అమలు చేయాలి.
- ఇండ్ల ఓబులమ్మ, గౌరీశంకర్ బద్వేలు

బాబూ.. ఏదీ జవాబు?

ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం




2,10,481 పథకానికి అర్హులు
420.96 ఏడాదికి సాయం రూ.కోట్లలో

సాగుకు సాయమేదీ



ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినప్పటి నుంచి రైతులు సాగులో నిమగ్నమయ్యారు. ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయి. ఈ తరుణంలో కేంద్రం తన వాటా ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటా ఇవ్వాలి.
- వక్కల హుసేన్ పీరా, రైతు, చిన్నచెప్పలి, కమలాపురం

నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి



2.80 లక్షలు యువనేస్తం పథకం అర్హులు
84 కోట్లు నెలకు కేటాయించాల్సిన నిధులు

మళ్లీ మోసం



2024లో ఎన్నికల్లో నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన చంద్రబాబు చేతిలో మళ్లీ మోసపోవాల్సిన పరిస్థితి కన్పిస్తోంది. ఇప్పటి వరకూ నిరుద్యోగ భృతి అమలుపై ఎలాంటి ప్రకటన చేయలేదు.
- దాసరి మహేష్ యాదవ్, ఎంబీఏ, గుంతచీపాడు, చాపాడు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



38,700 ప్రతిరోజూ ప్రయాణిస్తున్న మహిళలు

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పడో?



సూపర్‌సిక్స్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చిన హామీ నెరవేరుతుందా లేదా అనే సందేహం కలుగుతోంది. వెంటనే హామీ అమలు చేయాలి. 2014 ఎన్నికల్లో కూడా చంద్రబాబు మహిళలకు అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చిన పాపాన పోలేదు.
- పి. శైలజ, రాచాయపేట, గోపవరం మండలం

క్లుప్తంగా

ఇసుకు తరలిస్తున్న వాహనాలు సీజ్

సిద్దవటం : జ్యోతి ఇసుక డంప్ యార్డులో అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడుతున్న 3 లారీలు, రెండు ఇటాచ్‌లను మంగళవారం రాత్రి సీజ్ చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. సిద్దవటం మండలం జ్యోతిలోని ప్రభుత్వ ఇసుక డంప్ యార్డులో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 3 లారీలు, 2 ఇటాచ్‌లను సీజ్ చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.

మందుల దుకాణాల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ



మందుల దుకాణాలను తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధవి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని మందుల దుకాణాల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధవి తన బృందంతో కలిసి బుధవారం తనిఖీలు నిర్వహించారు. మెడికల్ షాపులకు సంబంధించి లైసెన్సులు, రికార్డులను పరిశీలించారు. పులివెందుల ప్రాంతంలో చాలామంది మెడికల్ షాపుల్లోనే వైద్యం అందిస్తున్నారని మండిపడ్డారు.

మద్యం తాగి ఆటో నడిపిన వ్యక్తికి 14 రోజుల జైలు

కడప అర్బన్ : మద్యం తాగి ఆటో నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి 14 రోజుల జైలు శిక్ష, రూ. 2500 జరిమానా విధిస్తూ కడప ఫస్ట్ స్పెషల్ జేఎస్‌సీఎం కోర్టు తీర్పు చెప్పింది. పఠాన్ అబ్దుల్ రెహమాన్ ఈనెల 17న మద్యం తాగి ఆటో నడుపుతూ పోలీసులకు దొరికాడు. దీనిపై ఎస్ఐ తాయర్‌హుసేన్ కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో ఫస్ట్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ మంగళగౌరీ శిక్ష విధించినట్లు కడప తాలూకా సీఐ జి. వెంకటేశ్వర్లు తెలిపారు.

వృద్ధురాలి గొలుసు లాక్కెళ్లిన దుండగులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న గ్యాస్ గోడౌన్ సమీపంలో బుధవారం ఓ వృద్ధురాలి మెడలో నుంచి మూడున్నర తులాల బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లారు. పట్టణంలో వరుస చోరీలు జరుగుతున్నా పోలీసులు పట్టుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

పార్టీ బలోపేతంలో అనుబంధ సంఘాలది కీలకపాత్ర

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో అనుబంధ సంఘాలది కీలక పాత్ర అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో అనుబంధ సంఘాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ముగిసి నాలుగు నెలలే అయిందని, ఈ ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు ఇవ్వడం తప్పా చేసిందేమీ లేదన్నారు. ఈ నాలుగు మాసాల్లోనే ప్రభుత్వం రూ.20వేల కోట్ల అప్పులు చేసిందన్నారు. గత ఐదేళ్లలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకొని ముందుకు పోతామని, పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యకర్తలకు ఏం జరిగినా అండగా ఉంటామని, ఎవరికి ఏ అన్యాయం జరిగినా కలిసికట్టుగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ హామీలు గుప్పించిన ప్రభుత్వం ఒక్క హామీని కూడా ఇంతవరకూ అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు జింకా విజయలక్ష్మి, ఓ. రసూల్, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ అధ్యక్షుడు పులి సునీల్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలు వద్దన్న మూర్ఖుడు చంద్రబాబు

దేశ చరిత్రలో మెడికల్ కాలేజీలు వద్దన్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబేనని, దేశంలో ఇంతటి దరిద్రమైన పాలకుడిని ఎప్పుడూ చూడలేని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన సాక్షి టీవీతో మాట్లాడుతూ పులివెందుల మెడికల్ కళాశాలకు వచ్చిన 50 సీట్లను లేఖ రాసి మరీ రద్దు చేయడం అత్యంత దారుణమన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి పెద్ద పీట వేశారని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో 11 మెడికల్ కాలేజీలు ఉంటే మరో 17 కాలేజీలకు అనుమతులు తెచ్చారన్నారు. ఈ కాలేజీల వల్ల 750 సీట్లు రాష్ట్రానికి వచ్చే అవకాశముందన్నారు. కానీ చంద్రబాబు వాటిని కాలదన్నారని విమర్శించారు.

పోలీసుల నిర్లక్ష్యంతో రిమాండ్ ఖైదీకి గాయాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పులివెందుల మండల పరిధిలోని రాయలాపురం గ్రామంలో వారం రోజుల క్రితం సొంత తమ్ముడిని హత్య చేసిన కేసులో అరెస్టయి ఖైదీగా ఉన్న బాబా ఫక్రుద్దీన్‌కు గాయాలయ్యాయి. అతన్ని పులివెందుల పోలీసులు కోర్టుకు హాజరు పరుస్తున్న నేపథ్యంలో కోర్టు సమీపానికి రాగానే పోలీసుల నిర్లక్ష్యం వల్ల బాబా ఫక్రుద్దీన్ పరార్ అయ్యేందుకు ప్రయత్నించాడు. సాధారణంగా హత్య కేసులో నిందితులను పోలీసు బందోబస్తు మధ్య కోర్టుకు హాజరుపరుస్తారు. బాబా ఫక్రుద్దీన్‌ను నిర్లక్ష్యంగా కోర్టు తీసుకెళుతుండగా గోడ దూకేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వెంటపడ్డారు. దీంతో నిందితుడు గోడ మీద నుంచి కింద పడి కాలు విరిగినట్లు సమాచారం. నిందితుడిని పోలీసులు చికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు.

టీడీపీ నాయకుడిపై ఎస్సీఎస్టీ కేసు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పులివెందుల పట్టణం బొగ్గుడుపల్లె రోడ్డు సమీపంలోని రోటరీపురంలో నివాసముంటున్న టీడీపీ నాయకుడు విజయ్‌కుమార్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రెండు రోజుల క్రితం ఇంటి పక్కనే ఉన్న ఎస్సీలతో విజయ్‌కుమార్‌రెడ్డి ఘర్షణ పడ్డాడు. ఘర్షణలో తమను కులం పేరుతో దూషించాడని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేతన్న నేస్తం పథకాన్ని తిరిగి అమలు చేయాలి

సిద్దవటం : నేతన్న నేస్తం పథకాన్ని చేనేత కార్మికులకు, సెడ్ కార్మికులకు అలైడ్ వర్కర్‌లకు తిరిగి అమలు చేయాలని (జేసీఐపీ)జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున కోరారు. సిద్దవటంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ పార్టీ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో చేనేత చైతన్య యాత్రలను నిర్వహించి సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30వ తేదీన అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా చేయనుందని తెలిపారు. ఈ సమాశంలో చేనేత ఐక్యవేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీరామదాసు ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు నూకల పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ మిల్లులపై కేసు నమోదు



ఆయిల్ మిల్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని శ్రీరామ ఆయిల్ మిల్‌పై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న దాడుల్లో భాగంగా అడిషనల్ ఎస్పీ జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత నూనె నాణ్యతను పరిశీలించారు. పామాయిల్ నిర్వహణ విషయంలో 10 టన్నులు వ్యత్యాసం ఉందని 6ఏ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ పండుగ సీజన్‌లలో కొంత మంది వ్యాపారులు నూనెలను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నూనెలను స్టాక్ ఉంచితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సఫా ఆయిల్ మిల్‌లో తనిఖీ

ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న సఫా ఆయిల్ మిల్‌లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. ట్యాంకులోని ఆయిల్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపారు. తూనికలు, కొలతలు పరికరాలకు ముద్రలు లేకపోవడంతో రూ.30వేలు జరిమానా విధించారు. ఈ మిల్‌పై కూడా 6ఏ కేసు నమోదు చేశారు.

ఖండాలు దాటిన వైవీయూ ఖ్యాతి

- విశ్వవిద్యాలయ ఆచార్యులకు అరుదైన గౌరవం
- ప్రపంచంలోని టాప్ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో ముగ్గురికి చోటు



ఆచార్య ఎం.వి. శంకర్



ఆచార్య ఎల్. వీరాంజనేయరెడ్డి



డాక్టర్ కె. వెంకటేశ్వర్లు

వైవీయూ : బోధన, పరిశోధనల్లో రాణిస్తున్న యోగి వేమన విశ్వవిద్యాలయం అధ్యాపకులకు మరో అరుదైన గౌరవం దక్కింది. ప్రఖ్యాత స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం తాజాగా విడుదల చేసిన పరిశోధకుల ర్యాంకింగ్‌లో వైవీయూకు చెందిన ఆచార్య ఎం.వి. శంకర్, ఆచార్య ఎల్. వీరాంజనేయరెడ్డి, డాక్టర్ కె. వెంకటేశ్వర్లు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశోధకుల జాబితాలో టాప్-2 శాతం సైంటిస్ట్‌ల జాబితాలో చోటు దక్కించుకున్నారు.

ఆచార్య ఎం.వి. శంకర్

విశ్వవిద్యాలయంలో నానోటెక్నాలజీ అండ్ మెటీరియల్ సైన్స్‌లో ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ ఎం.వి. శంకర్ గతంలో కూడా పలు విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లో ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచారు. ఈయన పరిశోధనలకు పేటెంట్‌లు సైతం ఉండటం విశేషం.

ఆచార్య ఎల్. వీరాంజనేయరెడ్డి

విశ్వవిద్యాలయంలో మైక్రోబయాలజీ విభాగం ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ ఎల్. వీరాంజనేయరెడ్డి మనదేశంతో పాటు, విదేశాల్లో సైతం ఉత్తమ పరిశోధనలు నిర్వహించారు. బయోటెక్నాలజీ, ఇన్ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఈయన రాసిన పరిశోధన పత్రాలు అత్యంత నాణ్యమైనవిగా గుర్తించారు.

డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు

యోగివేమన విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర శాఖలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె. వెంకటేశ్వర్లు ఆర్గానిక్ కెమిస్ట్రీలో రాసిన పరిశోధన పత్రాల సైటేషన్స్, హెచ్ ఇండెక్స్ ను ప్రామాణికంగా తీసుకొని మొదటిసారిగా మొదటి 2 శాతం పరిశోధకుల జాబితాలో నిలిపారు. కాగా ఈయన ప్రస్తుతం కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు.

పరిశోధకులకు అభినందనల వెల్లువ

విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు అధ్యాపకులు ప్రపంచ వ్యాప్తంగా టాప్-2 శాతం పరిశోధకుల జాబితాలో చోటు దక్కించుకోవడం పట్ల వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ అభినందనలు తెలిపారు.

ఎల్.ఎల్.బి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

వైవీయూ : జిల్లాలోని న్యాయవిద్య కళాశాల విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలు బుధవారం విశ్వవిద్యాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథ్‌రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ పరీక్షలకు 511 మంది హాజరయ్యారు. 33 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వైవీయూ పరీక్షల విభాగ ముఖ్య పర్యవేక్షకులు ఆచార్య పి. పద్మ తెలిపారు.

నేడు జిల్లా స్థాయి యువజనోత్సవాలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని స్పిరిట్స్ విద్యాసంస్థల్లో ఈనెల 19వ తేదీ గురువారం జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ తెలిపారు. జానపద నృత్యం (గ్రూప్), జానపద నృత్యం (సోలో), జానపద గేయం (గ్రూప్), జానపద గేయం (సోలో), స్టోరీ రైటింగ్, పెయింటింగ్, కవిత్వం, డిక్లమేషన్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాలలోపు వయసు కలిగిన అభ్యర్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు.

నవంబర్ 10 నుంచి అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్ : జిలా కేంద్రాల్లో నవంబర్ 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహణ ఏర్పాట్లపై రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ పునీత్ కుమార్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ అదితి సింగ్, రిక్రూట్‌మెంట్ మెడికల్ ఆఫీసర్ మేజర్ అమర్ దీప్ కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్ లతో కలిసి జిలా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకంలో భాగంగా ఇప్పటికే రాత పరీక్ష పూర్తయి అందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ టెస్టులు నిర్వహించేందుకు కడప జిల్లా కేంద్రంలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం వేదికగా మారనుందన్నారు. రాష్ట్రంలోని కర్నూలు, నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ కమిషనర్ నందన్, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, డీటీసీ మీరా ప్రసాద్, డీఎంహెచ్ఓ డి. నాగరాజు, ఆర్అండ్‌బీ డీఈ మాధవి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులు రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



ఎర్రగుంట్ల : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. బుధవారం ఎర్రగుంట్ల అర్బన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మద్యపానం జరిగే ప్రదేశాలను గుర్తించి దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులపై సరైన రీతిలో విచారణ జరిపి నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలన్నారు. పోలీసులు పనితీరును మెరుగు పరుచుకోవాలన్నారు. పెండింగ్ కేసులు, పిటీషన్ విచారణలు, ఇటీవల లోక్‌అదాలత్ కేసుల పరిష్కారంపై సమీక్షించారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాలలో మట్కా, గ్యాంబ్లింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. స్టేషన్ ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఐ నరేష్ బాబు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షురాలిగా విజయజ్యోతి ప్రమాణ స్వీకారం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా డి.విజయజ్యోతి బుధవారం నగరంలోని ఇందిరా భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామన్నారు. త్వరలో జిల్లా స్థాయిలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలు, మండల కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే పంచాయతీ, కార్పొరేషన్ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పక పోటీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండ్లకుంట శ్రీరాములు, బండి జకరయ్య, మహమ్మద్ అలీ ఖాన్, సత్తార్, సలావుద్దీన్, శ్యామల దేవి, సుజాతా రెడ్డి, కదిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని జమ్మలమడుగు పరిధిలోని కన్నెలూరు-2వ అంగన్వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త పోస్టుతోపాటు జిల్లాలోని 18 అంగన్వాడీ కార్యకర్తలు, 49 సహాయకులు, 4 మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అయితే పరిపాలన కారణాల రీత్యా జమ్మలమడుగు పరిధిలోని కన్నెలూరు-2 అంగన్వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న కార్యకర్త పోస్టును రద్దు చేశారన్నారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుల గడువు పొడిగింపు

వైవీయూ : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 24వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ ఎం. అనూరాధ తెలిపారు. డిసెంబర్ 8వ తేదీన నిర్వహించనున్న ఈ పరీక్షకు ప్రభుత్వ కార్యాలయ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఎస్ఈ.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న, కుటుంబ సంవత్సరాదాయం రూ.3.50 లక్షలలోపు ఉన్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. ఓసీ అభ్యర్థులు రూ.100, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ.60 ఫీజు చెల్లించాలని సూచించారు. దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డులో ఉన్న విధంగానే విద్యార్థి పేరును నమోదు చేయాలని సూచించారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రశీదును ఈనెల 27వ తేదీలోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పర్యాటక ఎక్స్‌లెన్స్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవం-2024కు రాష్ట్ర స్థాయి పర్యాటక ఎక్స్‌లెన్స్ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టూర్స్, ట్రావెల్స్, హోటల్స్ సంబంధిత సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఇతర వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.టూరిజం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన వాటిని ఏపీ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేషన్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడ చిరునామాలో ఈనెల 22వ తేదీలోగా తపాలా ద్వారాగానీ, వ్యక్తిగతంగాగానీ అందజేయాలన్నారు.

ఘనంగా ఆలిండియా నాతియా ముషాయిరా



నాత్ గీతాలను ఆలపిస్తున్న హజరత్ సయ్యద్ షా మొహమ్మద్ హుస్సేనీ బాషా సాహెబ్

కడప కల్చరల్ : కడప నగరంలోని మీలాద్ కమిటీ కార్యాలయంలో పవిత్రమైన మీలాదున్ నబీ మాస ఉత్సవాలను పురస్కరించుకొని మీలాద్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఆల్ ఇండియా నాతియా ముషాయిరా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్థాన ఏ షహమీరియ దర్గా పీఠాధిపతి సయ్యద్ షా మొహమ్మద్ హుస్సేనీ బాషా షామీరి సాహెబ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బెంగళూరు, మైసూరు, రాయలసీమ ప్రాంతానికి చెందిన కవులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మీలాద్ కమిటీ ప్రెసిడెంట్, మాజీ మంత్రి హాజీ మొహమ్మద్ అహ్మదుల్లా, వైస్ ప్రెసిడెంట్ ప్రభుత్వ హాజీ సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి, జాయింట్ సెక్రెటరీ షేక్ నయీమ్, కమిటీ సభ్యులు, ముస్లిం ప్రముఖులు, స్థానిక కవులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై దాడికి యత్నం

సిద్దవటం : సిద్దవటం తహసీల్దార్‌పై మాచుపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మల్లు వెంకటసుబ్బారెడ్డి దాడికి యత్నించడంతో బుధవారం అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. సిద్దవటం మండలం మాచుపల్లె గ్రామం సర్వే నంబర్ 99, 100లో భూమి కబ్జాకు గురైందని మాచుపల్లె గ్రామానికి చెందిన మల్లు వెంకటసుబ్బారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడన్నారు. కబ్జాకు గురైన భూమిని పరిశీలించేందుకు తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, సిబ్బంది గ్రామానికి వెళ్లారన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసి మరోసారి వస్తామని తహసీల్దార్ చెప్పారన్నారు. దీంతో మల్లు వెంకటసుబ్బారెడ్డి విధి నిర్వహణలో ఉన్న తహసీల్దార్ మురాషావలిని పరుష పదజాలంతో దూషించి దాడికి యత్నించాడన్నారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తికి గాయాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తిరుపతి నుంచి నిజామాబాద్‌కు వెళ్లే రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఓ వ్యక్తికి గాయాలయ్యాయని రైల్వే పోలీసులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పాల్‌రాజు రైలు కదులుతున్న సమయంలో ఎక్కేందుకు ప్రయత్నించగా ప్లాట్‌ఫామ్, రైలు ఫుట్‌బోర్డు మధ్య ఇరుక్కుని తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనలో చేయి పూర్తిగా తెగిపడగా, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి.

ఓపెన్ ఇంటర్‌పై అవగాహన కల్పించండి

చక్రాయపేట : అనివార్య కారణాల వల్ల చదువు మానేసిన వారికి ఓపెన్ ఇంటర్‌పై అవగాహన కల్పించాలని ఓపెన్ ఇంటర్ రాష్ట్ర అధికారి అక్బర్ వలీ పేర్కొన్నారు.బుధవారం ఆయన చక్రాయపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్ రంతూబాషా, కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. చక్రాయపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఓపెన్ ఇంటర్ సెంటర్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కలసపాడు : దూలంవారిపల్లె గ్రామానికి చెందిన మీసాల చిన్నఅంకయ్య (35) మంగళవారం రాత్రి తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. చిన్నఅంకయ్య 14 ఏళ్ల క్రితం కొమరోలు మండలం బాదినేనిపల్లి గ్రామానికి చెందిన నారాయణమ్మను వివాహం చేసుకున్నాడు. ఇంతవరకు సంతానం లేదు. ఈ నేపథ్యంలో భార్య నారాయణమ్మ పిల్లలు కలగలేదని భర్తను వేధించడంతో మంగళవారం రాత్రి మనస్తాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా

వైవీయూ : కడప నగరం కాగితాలపెంటలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 20వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ కె. రత్నరాజు తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ కోర్సు వరకు పాసైన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు.

ఉపకార వేతనాలకు గడువు పెంపు

కమలాపురం : జిల్లాలోని బీడీ కార్మికులు తమ పిల్లల ఉపకార వేతనాల దరఖాస్తుకు గడువు పొడిగించారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం బీడీ కార్మిక సంక్షేమ ఆసుపత్రి ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఈ నెల 30వ తేదీ వరకు, అలాగే ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు అక్టోబర్ 31వ తేదీ లోపు స్కాలర్‌షిప్.జీఓవీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.